కథ

# త్యాగం ఖరీదు

- శారదా అశోకవర్ధన్

"కృష్ణవేణి చచ్చిపోయిందిట..."

"ఆ...కృష్ణవేణి చచ్చిపోయిందా? ఎలాగా? ఎప్పుడూ?"

"కృష్ణవేణి చచ్చిపోయిందంటే ఆశ్చర్యంగా వుంది. నిన్నగాక మొన్న నాకు సుల్తాన్ బజార్‌లో కనిపించింది."కృష్ణవేణి చనిపోవడమేమిటి? మీరు పిచ్చిగా మాట్లాడుతున్నారు. నిన్న నేనూ అదీ కలిసి హాండీ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ కెళ్లాం. మనవరాలికోసం బిద్రీ గాజులూ, లోలకలూకొంది. అలా ఎలా చచ్చిపోతుంది? మీరు చెప్పేది నిజం కాదేమో? ఇలా అందరూ అంటూవుంటే సుచితకి ఎలా చెప్పాలో ఏం చెప్పాలో తెలీలేదు.

'నిన్న సాయంత్రం కడుపులో నొప్పిబాగా వచ్చిందట. ఇంట్లో ఆ సమయానికి ఎవరూ లేరు. వాళ్ళాయన కృష్ణమోహన్ క్లబ్బులో ఆ టైములో సాధారణంగా పేకాటలో వుంటాడు. ఎవరోపక్క వాళ్లు ఎవర్నో పంపించి క్లబ్బులో చూస్తే అతడు కనిపించలేదట! పిల్లలు ముగ్గురిలో పెద్దకొడుకు సుధీర్ కోడలు శమంత అమెరికాలోని న్యూజెర్సీలో వుంటున్నారు. పెళ్లి దాదాపు పదేళ్ళవుతున్నా ఎప్పటికప్పుడు ఈ ఏడాదొస్తాం! పై ఏడాదొస్తాం! అని చెప్పడమే తప్ప రాలేదు. కృష్ణవేణి ఒంట్లో బాగా లేదని ఫోన్లో చెప్తే, మంచి డాక్టర్ దగ్గరికెళ్ళి మంచిమందులు వేసుకోమని, పాపం! బాగానే సలహాలిస్తు వుంటారు కోడలు, కొడుకూను. తనకి కావలసింది మంచి మందులకన్నా, వారి తియ్యని మమతలని వాళ్ళకి తెలీదా? మనసుకి సంతోషం కన్నా కావలసిన మందేముంది? ఆ మాటే ఫోన్లో అనేది కృష్ణవేణి. "నువ్వు చాలా పాతకాలపు దానివమ్మా. మేము అక్కడికొచ్చినంత మాత్రాన నీ జబ్బులు నయమయిపోతాయా? ఎక్కడో అక్కడ అందరూ హాయిగా వుండాలని కోరుకోవాలిగానీ



ఇదేమిటి మరీ పిచ్చిదానిలాగా? మందులు కొనుక్కోవడానికి డబ్బులు లేకపోతే చెప్పు, పంపిస్తాను. ఉండవులే! ఎప్పుడున్నాయి కనుక? డబ్బు పంపిస్తాను. కక్కుర్తి పడి, దానికీ దీనికీ ఖర్చు పెట్టెయ్యక డాక్టర్ దగ్గరికెళ్లు" – కొడుకు సలహా చెప్పేసి ఫోన్ పెట్టేసేవాడు.

ఆ రోజంతా అన్నం తినకుండా, కన్నీళ్ళు తాగుతూ ఆలోచనలతో అలిసిపోయి మంచానికంటుకు పోయేది కృష్ణవేణి. రెండో కొడుకు అనిల్ ఒక సినిమా యాక్టర్‌ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆమె ఎక్కడికి వెళితే అక్కడికి కొంగుచ్చుకు తిరగడమే వాడిపని. అందులోను అప్పుడప్పుడే నాలుగు సినిమాల్లో చేసి పేరు తెచ్చుకుంటున్నదామె. వాడికదే ఎంతో గొప్ప. ఆమెగారి సేవల్లో వాడికి తల్లీచెల్లీ ఏవీ గుర్తుండదు. ఒకసారి తానుగా కృష్ణవేణి ఆమాటే అడిగితే, మధ్యలో కోడలుగారు కల్పించుకుని నానా మాటలూఅని, తను మాట్లాడ్డం మానెయ్యడమేకాదు, అనిల్‌ని ఫోన్ చెయ్యనివ్వకుండా చేసింది. తనే ఫోన్‌చేస్తే ఫోన్ దగ్గరికి రానివ్వకుండా చేసింది ఆవిడగారు.



అనిల్ ఆవిడ గారికి భర్త మాత్రమే కాదు, మంచి నౌకరుకూడా. అందులోనూ విశ్వాస పాత్రుడైన నౌకరు. అతనిచేత ఉద్యోగంకూడా మానిపించేసి, వాణ్ణి ఆవిడగారి వ్యవహారాలు చూసుకోవడానికి పి.ఎగా వాడుకుంటోంది.

కృష్ణవేణి బాధల్లా వాడు ఆ పిల్లకు పి.ఏ. లాగానో, నౌకరు లాగానో పనిచేస్తున్నాడని కాదు. ఇంజనీరింగ్‌చేసి, మంచి ఉద్యోగాన్నొదులుకుని ఇలా కేవలం ఆమె భర్తగా మాత్రమే మిగిలిపోవడం, చివరకు కన్నవాళ్ళనికూడా మర్చిపోవడం ఆమెను కృంగదీశాయి. వాణ్ణి తలుచుకుంటే ఆ రోజంతా ఆమెలో ప్రవహించేది రక్తం కాదు నిస్పత్తువ!

ఇకపోతే భావన! దాన్ని ఎం.సి.ఏ. వరకు చదివించడానికీ, ఒక మంచి అయ్యచేతిలో పెట్టడానికీ ఎన్నో కలలుకందితను. ఎం.సి.ఏ. చేసిందికానీ, వేరే కులం కూడా కాదు. వేరే మతంవాణ్ణి ప్రేమించి ఇంట్లో చెప్పే ధైర్యంలేక, గుట్టు చప్పుడు కాకుండా వెళ్లిపోయి, ఎక్కడో పెళ్లిచేసుకుని ఆ తర్వాత ఇంటికొస్తే అందరూకాదన్నా తనుమాత్రం హారతిచ్చి లోపలికి ఆహ్వానించింది. దానిపెళ్లికోసం కొన్న నగలూ చీరలూ అన్నీతీసిచ్చింది.

కానీ ఈ రోజున తనూ, తననే తప్పులెంచుతుంటే కడుపు తరుక్కుపోయింది. ఆ బాధ భరించలేకపోతుంది. గతం కళ్ళముందు ప్రళయ తాండవం చేస్తుంటే కళ్ళు మూసుకుపడుకుంది.

తనకి పెళ్ళికి ముందే తెలుసు కృష్ణమోహన్‌కి పేకాటపిచ్చి వుందని! అయితే ఒక మంచి భార్యగా అతని వ్యసనాన్ని మార్చొచ్చుననుకుంది. అనురాగవతి అయిన భార్యగా, అత్తగారిని, బావమరుదులను, ఆడపడుచులను ప్రేమించే మంచి వ్యక్తిగా, ఆదర్శమైన కోడలిగా పేరుతెచ్చుకోవాలనుకుంది. ముగ్గురు బిడ్డలని అల్లారు ముద్దుగా పెంచి, వారికి ఏ లోపమూ రాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారు కోరిన చదువులు చెప్పించి, వారు కోరుకున్న వారితో పెళ్ళిళ్లు చేయించి మంచి అమ్మగా పేరుతెచ్చుకుని వారి కనుసన్నలలో మెలగాలని అనుకుంది. అందుకోసం చిన్న ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగంలో చేరింది. స్వెట్టర్లు, లేసులు అల్లి డబ్బు సంపాదించింది. పచ్చళ్ళు, ఆవకాయలు, సాంబారు పొడులు చేసి డబ్బులు సంపాదించింది. అత్తగారి అనారోగ్యం, మామగారి ముసలితనం, భర్త పేకాట, పిల్లల ఆలనా పాలనా, బంధువుల రాకపోకలు, మర్యాదలు, సంప్రదాయాలు, వీటికి కృష్ణవేణి సంపాదన సరిపోయేది కాదు. చిట్టీలు కట్టేది. చిట్టీలు పాడి పిల్లల ఫీజులూ, బట్టలూ వగైరాలన్నీ ఎవరికీ తీసిపోకుండా కొనిపెట్టేది. భావన పెళ్ళి కోసం ఏదో విధంగా డబ్బులు దాచో, అప్పుచేసో గొప్పగా కాకపోయినా నలుగురిలో పరువుగా చెప్పుకునే విధంగా నగలు చేయించి పెట్టింది. బట్టల దుకాణాల్లో వాయిదాల మీద బట్టలు కొనిపెట్టింది.

ఇవన్నీ చేస్తున్నందుకు అందరూ సంతోషించారే తప్ప, దీని వెనుక ఆమె పడే కష్టాన్ని గురించీ, ఎవరూ ఆలోచించలేదు. వాళ్లందరి మొహాల్లోంచి సంతోషమే తన ఆస్తిగా పొంగిపోయింది కృష్ణవేణి. కొడుకుల పెళ్ళిళ్ళలోనూ కూతురి పెళ్ళిలోనూ కూడా ఎవరికీ మాటరాని విధంగా ఏర్పాట్లన్నీ చేసింది

*** *** ***

కృష్ణవేణి పేరు ఎలా ఎంపిక చేశారోగాని, పవిత్రతతో, మంచికి మారుపేరుగా, కృష్ణానదిలాంటి గంభీర స్వభావం ఆమెది. పవిత్ర జలంలా ప్రేమించే మనస్తత్వం ఆమెది. కోపం వస్తే వరుగెత్తే కృష్ణవేణిలా, పొంగుకొచ్చే అలల కృష్ణవేణిలా అరుస్తుంది. వెంటనే సుళ్ళుతిరిగే కృష్ణలా, కన్నీళ్ళు కార్చేసి మళ్ళీ మామూలుగా ప్రవహించే కృష్ణా తీరంలా ప్రశాంతంగా అయిపోతుంది.

పండిపోయిన ఆకులు రాలిపోయినట్టు అత్తామామలు, వృద్ధాప్యంలో కాలం చేశారు. బావమరుదులూ, ఆడపడుచులూ ఎవరి వాటాలు వాళ్లు తీసుకొని ఎవరికి వాళ్ళయిపోయారు. కంటికి రెప్పలా వుంటారనుకున్న కొడుకులిద్దరూ కంటికి దూరంగా వాళ్ళ వాళ్ళ పనుల్లో ఇమిడిపోయారు. కడుపులో దాచుకోలేక కన్నబిడ్డకి గతం జ్ఞాపకం చేసినా తన కష్టాలు నెమరు వేసినా, "మా కోసం ఇవన్నీ ఎవరు చేయమన్నారు? నీ ఆరోగ్యం ఎవరు పాడుచేసుకోమన్నారు? మువ్వు పట్టించుకోకుండా వుంటే మా రాతలెలా వుంటే అలాగే వుండేవాళ్ళం. 'మాటిమాటికీ' మీకోసం నేనేదో త్యాగం చేసేశాను అంటూ చెప్పడం మాకు బాధ కలిగిస్తోంది. నా పెళ్ళికి అన్ని నగలు పెట్టమని నేనడిగానా? అవి నీ ముసలితనంలో పనికొస్తాయని దాచుకోవలసింది" అన్న భావన మాటలకి కృష్ణవేణి తల్లడిల్లిపోయింది, గండి పడిన నదిలాగా ఉద్రేకంతో ఊగిపోయింది.

అప్పుడే కళ్ళు తెరచినట్టయింది! ఆడపిల్ల పుట్టిన

ప్పటి నుంచి బాల్యంలో తల్లిదండ్రుల దగ్గర ఎలా వుండాలి, భర్త దగ్గర ఎలా వుండాలి, పిల్లల దగ్గర ఎలా వుండాలీ, ఎటువంటి త్యాగాలు చెయ్యాలీ అని చేసిన బోధనలని తుడిచి పారెయ్యాలనిపించింది. ప్రేమ, బంధుత్వం, నీతీ, భీతీ అనే సంప్రదాయపు చట్రంలో ఆమెనెలా నలిపేస్తోందో సమాజం, తలుచుకుంటే వరదల్లా, వరద వల్ల కలిగిన బురదల్లా మనసు కొట్టుకుపోతోంది. ఎంత చేసినా ఆడదాని బతుకింతేనా? మొట్టమొదటిసారిగా తనమీద తనకే అసహ్యం వేసింది కృష్ణవేణికి. ఏ అరుపూ కేకావెయ్యాని, నోరు మెదపని కృష్ణమోహన్‌కి ఏం చింతా లేదు! అతణ్ణి ఎవరూ ఏమీ అనరు. పాపం! అతడెప్పుడూ పేకాటలో బిజీయే కదా! ఎప్పుడైనా ఏ పనైనా చేసిన వాళ్లకే కదా మెప్పులైనా చెప్పులైనా? కృష్ణవేణి మరి ఆలోచించలేకపోతోంది. కడుపులోని నరాలనన్నీ వుండచేసి పిండుతున్నట్టుగా నొప్పి! ఎవరి సహాయాన్నీ అర్థించకూడదని, ఎదురుగా కనబడ్డ నర్సింగ్‌హోంలో చేరిపోయింది. ఒక గాజుల జత అమ్మేసి డబ్బు తెప్పించుకుంది స్నేహితురాలు స్మితకి చెప్పి. 'అపెండిసైటిస్' బరెస్ట్ అయిందిట. ఎమర్జెన్సీ ఆపరేషన్. కృష్ణమోహన్ పేకాటకి ఫ్రెండ్స్‌తో కలిసి మరో ఫ్రెండ్ కూతురి పెళ్ళికెళ్ళాడని ఆమెకి తెలుసు. కానీ అలా అని ఆమె ఎవ్వరికీ చెప్పలేదు. క్లబ్బులో చూసొచ్చి, అక్కడ లేడని చెప్పారు స్నేహితులు. ఆపరేషన్ చేసెయ్యమని చెప్పింది కృష్ణవేణి! ఆ డాక్టరు గాభరాగా ఆపరేషన్ చేసేశాడు. చచ్చేంత బిల్లు కూడా పుచ్చుకున్నాడు.అప్పటికి గాని బయట పడలేదు ఆమెకింకా ఏవేవో ప్రాబ్లమ్స్ వున్నాయని. తప్ప డాక్టరిదో, కృష్ణవేణి ఆయువు తీరిపోయిందో! ఆ రాత్రే ఆమె భర్తనీ, బిడ్డల్నీ తలుచుకుంటూ, వాళ్ళ కోసం కలవరిస్తూ కళ్ళు మూసింది.

దావానలంలా అల్లుకున్న వార్తతో అమెరికా నుంచి సుధీరూ, అనీలూ, భావనా కుటుంబాలతో సహా పరుగెత్తుకొచ్చారు. కృష్ణమోహన్ టాక్సీ కట్టించుకుని విజయవాడ నుంచి హైదరాబాద్ ఒచ్చేశారు. అందరూ నర్సింగ్‌హోం కెళ్ళారు బిల్లు కట్టడానికి. కానీ కృష్ణవేణి ముందే బిల్లుచెల్లించిందని తెలిసి షాక్ తిన్నారు.

ఆపరేషన్‌కి ముందు కృష్ణవేణి రాసిపెట్టిన ఉత్తరాన్ని భావన అందరికీ చదివి వినిపించింది.

'శ్రీవారికీ, పిల్లలకీ ప్రేమతో కృష్ణవేణి:

పాయింట్ వన్ :– భర్తని ప్రశ్నించక పోవడం, నేను మార్చి అతని అలవాట్లను స్వభావాన్ని ఏదో ఉద్ధరిస్తానని అనుకోవడం అవివేకం.

పాయింటు టూ:– పిల్లలకి ఏ కొరతా రాకుండా చూస్తే, వాళ్లు నాకు ఏ కొరతా రానివ్వకుండా చూస్తారనుకోవడం తెలివితక్కువతనం. అసలు ఆడది పరాధీనగా బతకడం చచ్చుతనం. నే చేసినవన్నీ పాతకాలంలో అయితే 'త్యాగాలేమో! కానీ ఇప్పుడవి విలువలేని చేతలు! ఎవరు చెయ్యమన్నారు నిన్ను! అని అనిపించుకోవడం తప్ప అర్థంలేని పనులు! అందుకే నేను పోయే ముందు దేముణ్ణి ప్రార్థించేది ఒక్కటే! ఆడది ఎప్పుడూ పరాధీనగా బతకకూడదని, ఎవరి దగ్గరా ఏదీ ఆశించేదిగా మిగలకూడదని, తన వ్యక్తిత్వాన్ని తాను నిలబెట్టుకుంటూ ఇతరుల కోసం వెలుగునిచ్చే వెన్నెలలా వుండాలిగానీ, కాలిపోయి వెలుతురునిచ్చే కొవ్వొత్తిలా వుండొద్దనీ!

– ఇట్లు ప్రేమతో

–ఒక భర్తకు భార్య,

– ముగ్గురు పిల్లలకు తల్లి

–కృష్ణవేణి.

నలుగురి కళ్ళల్లో నుంచి కృష్ణవేణి నాలుగు పాయలుగా విడిపోయి, నాలుచోట్లా పొంగుకొస్తున్నట్టు దుఃఖం ముంచుకొచ్చింది. అంతరాంతరాల్లో దాక్కున్న ప్రేమ కెరటంలా ఉబికొచ్చింది. మనిషి డబ్బు సంపాదనా, కీర్తి కందూతిలో పడి ఆప్యాయతలూ, అనురాగాలూ అన్నీ మర్చిపోతున్నాడు. ధనం, ధనంతో లభించిన కీర్తి రెండూ శాశ్వతాలు కావు. శాశ్వతమైనదీ తృప్తినిచ్చిది ప్రేమ ఒక్కటే, నీ కోసం నేనున్నానన్న మాట ఒక్కటి చాలు మనిషిని బ్రతికించడానికి! వేదాంతిలా ఎవరిలో వారే ఇలా గొణుక్కొంటుంటే కృష్ణవేణి ఆత్మ శాంతించిందేమో తృప్తితో ఉప్పొంగి పోయిందేమో వర్షం పెద్దదయింది! వడగళ్లవాన! ఉరుములూ మెరుపులూ! విలువలేని త్యాగానికి గర్జిస్తున్నట్టుగా

'ఆమె త్యాగానికి వెల ఆసుపత్రి ఫీజు చెల్లించడానికి ముందుకురికిన భర్తా పిల్లలూ!

అందుకే ప్రకృతి ఏడుస్తున్నట్టే వాన!.. గొణుక్కుంది సుచిత!

## విన్నపాలు

# రైలుగేటు

వేరు శనక్కాయలు తంపటి శనక్కాయలు ఉడకబెట్టిన శనక్కాయలు సోడా సోడా ఎప్పుడురా నానించి ఈ రైలు గేటు ఎత్తేస్తారు గోల్డెన్ గేట్ బ్రిడ్జి మీద వెళ్తూ వెళ్తూ లాగు జేబులో కండోమ్‌లు కుక్కుకున్నాను ఎందుకయినా మంచిదని పుచ్చులు చూసి మరీ తినాలి తంపటి శనక్కాయలు ఉడకబెట్టిన శనక్కాయలు ఆగిపోతాయి బస్సులు లారీలు ఆగిపోతాయి సైకిలయితే నెత్తిమీద పెట్టుకొనెళ్ళవచ్చు–గాబులో పడిపోయిన బాబు స్మృతిలా నెత్తిమీద పెట్టుకుని వెళ్ళొచ్చు రెక్కాడుతుంది డొక్కాడుతుంది తంపటి వేరుశనక్కాయల్ని కొంటే తింటే నీ నవ్వు నాలో ఇరుక్కొని ఇంతకాలవూ ఊడిరావడం లేదు అదొక రోదసిలో ఇరుక్కొన్న సాలిగూడు అందుకనే నేనంతరాత్మకి కుంకుం బొట్లు పెట్టుకుంటున్నాను ఇన్నీ ఇన్నీ అని ప్రార్థనలు చేసుకొంటున్నాను పథవిహీనలందరూ నా పరిచారికల్ నేనే పర్యవేక్షకుడ్ని ఈ విశ్వపు చీమని నా యాంటిన్నా మీద దొర్లించుకొంటున్నాను మేరీ మాత చర్చీ పక్కనే వెతుతూంటాను పవిత్రమైన పాలకోసమే దారిలో అనుకోకుండా సిల్కు స్మిత రెండు పాల పాకెట్లు తెస్తూ ఎదురవుతుంది గేటు ఇక ఎప్పటికీ పడే వుంటుంది.

–మో